తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# కారీరిష్టి , వరుణ యాగంకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



తిరుమల, ఆగస్టు22 ప్రభాతవార్తప్రతినిధి:

దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని... సకాలంలో మంచి వర్షాలు కురవాలని తిరుమలేశుని ప్రార్థిస్తూ చేపట్టే కారీరిష్టి యాగం, వరుణజపం, వర్షన్యశాంతి హోమాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించే ఈ యాగాలకు 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 26న మహాపూర్ణాహుతి జరగనుంది.

చలువ చందనములు పూయ

# చందమామ రావే

## చంద్రయాన్ 3 జాబిల్లి దక్షిణ ధృవంపై ముద్దాడే వేళ నేటి సాయంత్రం ఒక అద్భుతం ఆవిష్కృతం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 22, ప్రభాతవార్త



అంతరిక్ష పరిశోధనా యజ్ఞంలో భారత శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించే ఘడియ వచ్చేసింది. ఇంత వరకూ అగ్ర రాజ్యాలు సైతం సాధించలేని చంద్రుని దక్షిణ ధృవం మీద పరిశోధనలు మనం చెయ్యబోతున్న ట్లు ఇస్రో శాస్త్రవేత్తలు గట్టి ధీమాగా ఉన్నారు. గత నెల 14న మన తిరుపతి జిల్లా శ్రీహరికోట అంత రిక్ష కేంద్రం నుండి ప్రయోగించిన చంద్రయాన్ 3 ఉపగ్రహం 40 రోజుల ప్రయాణంలో ఎటువంటి ఒడిదుడు కులు లేకుండా చంద్రునికి దగ్గరగా వెళ్ళింది. ఇప్పుడు చీకటిగా వుండే జాబిల్లి దక్షిణ ధృవం మీద వెలుగులు విరజిమ్మే అవకాశం మన చంద్రయాన్ 3కి వచ్చింది. అంతరిక్ష పరిశోధనల్లో ఆరితేరిన అమెరికా, రష్యా, చైనా దేశాలకు ఇది సాధ్యం కాలేదు. అందు చేతనే ఈసా, నాసా వంటి కొమ్ములు తిరిగిన అంతరిక్ష పరిశోధనా సంస్థలు ప్రస్తుతం చంద్రయాన్ 3 వైపు కన్నెత్తి చూస్తున్నాయి. ఇస్రో శాస్త్రవేతలు ఎంతో మంది చంద్రయాన్ 3 అనుకున్న లక్ష్యం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన చంద్రయాన్ 2 ప్రయోగం చివరి దశలో నిరాశ పరిచినప్పటికీ అప్పటి ఆర్బిటర్ నాలుగేళ్లుగా పరిశోధనలు చేస్తూనే వుంది. అప్పట్లో చైర్మన్‌గా వున్న శివన్ ప్రస్తుత చంద్రయాన్ 3 ప్రయాణంపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రవేత్తలకు వుత్సాహం తీసుకు వచ్చేలా మాట్లాడుతున్నారు. ప్రస్తుతం ఇస్రో చైర్మన్‌గా వరుస విజయాలు సాధిస్తున్న సోమనాథ్ మొదటి నుండి నమ్మకంతో వున్నారు. చంద్రయాన్ 3లో కొన్ని మార్పులు సాఫ్ట్ లాండింగ్‌కు అనుకూలంగా ఉన్నాయని ఆయన చెబుతున్నారు. అటు కేంద్ర ప్రభుత్వ పెద్దలు, ఇటు సహచర శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.

### 5.20 గంటల నుండి ప్రత్యక్ష ప్రసారాలు..

ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ 3 సాఫ్ట్ లాండింగ్ ఘట్టాలను బుధవారం సాయంత్రం 5.20 గంటల నుండి ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో

# ఉచిత సేవకుల సేవలకు బ్రేక్



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేస్తున్న ఉచిత సేవకుల సేవలకు బ్రేక్ ఏర్పడింది. మంగళవారం ఇఓ ఆదేశాలతో ఆలయం లోపల పని చేస్తున్న ఉచిత సేవకులు, స్వామి అమ్మవార్ల గర్భగుడిలోనూ, పరివార దేవతల ఆలయాల వద్ద పని చేసే ఉచిత సేవకులను బయటకు పంపి వేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయం ఉదయం 4గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు పని చేస్తుంది. అయితే ఆలయానికి ఉన్న సిబ్బంది సంఖ్య పరిపోదు. దాంతో ఇక్కడ ఉచిత సేవకులు సేవలందిస్తున్నారు. వారికి దేవస్థానం ఎలాంటి జీత భత్యాలివ్వదు. కానీ వారు రెగ్యులర్ ఉద్యోగుల వద్ద వారి ఆదేశాల మేరకు పని చేస్తూ వారి అందించే తృణమో పణమో తీసుకొని తమ కుటుంబాలను పోషించుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ఒక్కొక్క షిఫ్టుకు కనీసం 40 మంది ఇలా పని చేస్తూ బతుకుజీవనం గడుపుతున్నారు.

**నరేంద్ర సంఘటనతో . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత వారం ఓ వ్యక్తి పని చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం విదితమే. అయితే ఆతను రెగ్యూలర్ ఉద్యోగా? లేక ఉచిత సేవకుడా? అనేది సందిగ్ధత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆలయ పాలనలో కొంత చర్చ చోటు చేసు కుంది. అంతేకాక ప్రతిపక్షాలు ఇటువంటి అంశాలను చర్చనీయాంశంగా మారుస్తున్నారు. బతుకు జీవనం కోసం ఉచిత సేవలందిస్తూ కాలం గడుపుతున్న వారికి ఆలయాధికారుల నిర్ణయం కొంత ఇబ్బంది కల్గించింది. దాంతో ఆలయాదికారి కెవి సాగర్‌బాబు నిర్ణయం తీసుకున్నారు. ఆలయంలో పనిచేసే ఉచిత సేవకులందరిని బయటకు పంపి వేయాలని ఏఇఓలకు ఆదేశించారు. ఏఇఓ సతీష్‌మాలిక్ ఆదేశాలతో టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు ఉచితంగా సేవలందిస్తున్న వారిని పంపివేసారు. సుమారు 40మందికి పైగా ఉచిత సేవకును ఒక షిఫ్టు నుంచి పంపివేసారు. అయితే స్వామి అమ్మవార్ల గర్భగుడుల వద్ద రెగ్యూలర్ అర్చకులకు ఉచిత సేవకులు ఎంతో చేదోడువాదోడుగా ఉండే వారు. ఇఓ నిర్ణయంతో రెగ్యూలర్ అర్చకులపై పని భారం పెరుగుతుంది.

### ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తాం: ఇఓ



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఉచిత సేవకులను తొలగించుటకు సంబంధించి ప్రభాతవార్త ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబును వివరణ కోరగా ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలతో ఉచిత సేవకుల సేవలతో కొన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కాబట్టి ఉచిత సేవకులను బయటకు పంపక తప్పలేదన్నారు. అయితే పనిభారం పెరుగుతుందని అయితే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

## ఎంపిటిసి.. సర్పంచ్ కుమారుడి లీల.. ఛీటింగ్ కేసు నమోదు !!

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త

గ్రామ సచివాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని ఏడు లక్షల నగదు, మూడు లక్షల రూపాయలకు ఖాళీ చెక్కు తీసుకుని నాలుగేళ్లు గడుస్తున్నా అతనికి ఉద్యోగం రాకపోవడంతో బాధితుడు కుప్పంపోలీసులను ఆశ్రయించారు. ఈ తరహా మోసానికి అధికార పార్టీకి చెందిన ఓ ఎంపిటిసి, ఓ మహిళా సర్పంచ్ కుమారుడు తెరలేపారు. ఈసంఘటనకు సంబంధించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్న మేరకు వివరాలిలా.. కుప్పం మండలం గణేష్‌పురంకు చెందిన గోవిందరాజు కుమారుడు కామరాజ్ బిటెక్ వరకు చదివాడు. ఉద్యోగం లేకపోగా గణేష్‌పురంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా 2019సంవత్సరంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో కామరాజ్ విఆర్వో పరీక్షకు హాజరయ్యాడు. పరీక్షల్లో అతనికి యాభై మార్కులు వచ్చాయి. అయితే ఉద్యోగం రావాలంటే మరో ఒకటిన్నర మార్కులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కామరాజ్‌కు సమీప బంధువుమల్లానూరు పంచాయతీ ముత్తూరుకు చెందిన తిమ్మరాయన్ (ప్రస్తుత అధికార పార్టీ ఎంపిటిసి)అనే వ్యక్తి మార్కులు తక్కువ వచ్చినా పది లక్షల రూపాయలు ఇస్తే నీకు ఉద్యోగం తీసిస్తానని నమ్మబలికినట్లు బాధితుడు కామరాజ్ పేర్కొన్నాడు. దీంతో తాను తన తండ్రి గోవిందరాజులుతోపాటు తిమ్మరాయన్‌ను ఆశ్రయించామన్నారు. ఈ విషయంగా వానగుట్టపల్లికి చెందిన ప్రస్తుత మహిళా సర్పంచ్ కుమారుడు రామచంద్రన్, తిమ్మరాయన్‌లు కలసి పది లక్షలు అడిగారన్నారు. దీంతో తాము 2019లో అడ్వాన్సుగా 7లక్షలు ఇచ్చామన్నారు. మరో మూడు లక్షలకు గాను ఆం ధ్రబ్యాంకు ఖాళీ చెక్కును తమనుంచి వారు తీసుకున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. కాగా సచివాలయ ఉద్యోగం ఇప్పించాలని పలుమార్లు వారిని తాను కోరగా విజయవాడలో మాట్లాడామని త్వరలోనే ఉద్యోగ నియామకపత్రం వస్తుందని చెబుతూ వచ్చారన్నారు. మూడేళ్లు గడచినా తనకు ఉద్యోగం రాకపోగా ఇచ్చిన నగదు వాపసు ఇవ్వాలని కోరితే పట్టించుకోకపోగా నీ చేతనైంది చేసుకో అంటూ తనను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగం పేరిట తనను మోసగించిన తిమ్మరాయన్, రామచంద్రన్‌లపై తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం తిమ్మరాయన్, రామచంద్రన్‌లపై అర్బన్ ఎస్సై శివకుమార్ సెక్షన్ 420రెడ్‌విత్ 34 ఐపిసి సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గతేడాది గుడుపల్లె మండలంలో ఓ అధికార పార్టీ నేత ఇలాగే ఉద్యోగం తీసిస్తానని నగదు వసూలు చేయడం, తాజాగా కుప్పం మండలంలో సైతం అదే తరహాలో నగదు వసూళ్లకు పాల్పడడం ఇప్పుడు అధికార పార్టీలోనే చర్చకు దారితీస్తోంది.

# గజరాజుల దాడులు.. పంటలు ధ్వంసం



నేలకొరిగిన రాతికూసాలు

పెద్దపంజాణి ఆగషు 22 ప్రభాతవార్త :

పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లి పంచాయతీ కొత్తబూరగపల్లి, తిప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయ పొలాలపై గజరాజులు గుంపు దాడిచేసి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో సుమారు లక్షరూపాలకు పైగా పంటనష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేధన వ్యక్తం చేశారు. కొత్తబూరుగపల్లి గ్రామానికి చెందిన మునివెంకట రెడ్డి వ్యవసాయపొలంలో వచ్చిన గుంపు ఏనుగులు మామిడి తోటకొసం ఏర్పాటు చేసిన రాతి పెన్సింగ్ కూసాలను ధ్వంసం చేశాయి. అదేవిధంగా తిప్పిరెడ్డిపల్లికి చెందిన బాబూరెడ్డి, నరేంద్రరెడ్డి అనేరైతులు సాగుచేస్తున్న రాగిపంట, అరటితోట, పశు గ్రాసాన్ని తిన్నంతతిని మిగతావాటిని తొక్కి ధ్వంసం చేశాయి. చీకటిపడితే ఏనుగులు పంటపొలాలపై దాడులకు దిగుతుండటంపట్ల పంటపొలాలవద్దకు వెళ్ళేందుకు రైతుల భయాందోలనలు చెందుతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న పంటలను ఏనుగులు ధ్వంశం చేస్తుండడంపట్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ప్రభుత్వం స్పందించి పంటపొలాలపై ఏనుగుల దాడులు నిరోదానికి తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా అటవిసిబ్బంది దొరస్వామి, రవికుమార్‌లు ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి పంట నష్టంకోసం ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. ఏనుగుల దాడులను నిరోదించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.



ధ్వంసమైన పంటలు

### మృతిచెందిన రైతు కుటుంబానికి 5లక్షల చెక్కు అందజేత



పెద్దపంజాణి మండలం పెద్దకాపల్లి పంచాయతీ బందార్లపల్లి సమీపంలో ఇటీవల ఒంటరి ఏనుగుదాడిలో ముదిరెడ్డిపల్లికి చెందిన మార్కొండయ్య అనే రైతు మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే డా॥ఎన్. వెంకటేగౌడులు ప్రభుత్వం తరుపున మృతిచెందిన రైతు మార్కొండయ్య కుటుంబానికి ప్రభుత్వం తరుపున 5లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని మృతుని భార్య అరుణమ్మకు అందజేసారు. బాధితకుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎంపి రెడ్డెప్ప హామీఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప, వైస్ ఎంపిపి అంజమ్మ, వైకాపా మండలకన్వీనర్ బాగారెడ్డి, వైకాపా జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రహంతుల్లా, నేతలు రాజారెడ్డి, రమణారెడ్డి తధితరులు పాల్గొన్నారు.

# భక్తుల వస్తువులకు మరింత భద్రత!

## ఇకపై వేగంగా సేవలందించేంలా బాలాజీ బ్యాగేజీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లగేజీ తరలింపు వాహనాలకు జిపిఆర్ఎస్ - ఈఓ ధర్మారెడ్డి



తిరుమల, ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ కాలినడక మార్గాల్లోనూ వాహనాల్లో తిరుమలకు చేరుకునే భక్తుల లగేజీ, మొబైల్‌ఫోన్‌ల డిపాజిట్, తిరిగి అందించే ప్రక్రియ ఒకేచోట అమలుచేసేందుకు వీలుగా విధానాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. భక్తులు తమ లగేజీలను, మొబైల్‌ఫోన్లను డిపాజిట్ చేసి తిరిగి తీసుకునే ప్రక్రియను వేగంగా, మరింత సులభంగా చేపట్టేందుకు డిజిటలైజేషన్, ఆటోమేషన్ ద్వారా నూతనంగా బాలాజీ బ్యాగేజ్ మేనేజ్‌మెంట్ విధానం అమలుచేస్తున్నట్లు చెప్పారు. నూతన విధానంలో సాఫ్ట్‌వేర్ కోసం దాతలు ముందుకువచ్చారన్నారు. నూతన విధానంలో భక్తులు లగేజీ కౌంటర్ వద్దకు చేరుకోగానే వారి వద్ద ఉన్న దర్శన టిక్కెట్ స్కాన్‌చేసి వాటి వివరాలు ఎలక్ట్రానిక్ డివైస్‌లో ఆటోమేటిక్‌గా నిక్షిప్తం చేయడం జరుగుతుంది. దర్శన టిక్కెట్ లేని భక్తులకు వారి వివరాలు, పేరు నమోదు చేసుకుని బ్యాగ్‌కు ఆర్ఎఫ్ఐడి నిక్షిప్తమైన ట్యాగ్‌ను టైప్‌క్లిప్ ద్వారా జతపరచి ఆటోమేటిక్ జనరేటెడ్ క్యూఆర్‌కోడ్ రశీదును ఇస్తారని చెప్పారు. లగేజీ డిపాజిట్, సురక్షితంగా తరలింపు, తిరిగి యాత్రికులకు భద్రంగా తిరిగి ఇచ్చేవిధానంపై మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, బెంగుళూరుకు చెందిన దాత వేణుగోపాల్, హైదరాబాద్‌కు చెందిన ట్రాక్ ఇట్ సంస్థ సిఇఓ వేదాంతం సోమశేఖర్, హార్డ్‌వేర్ కోసం చెన్నైకి చెందిన చార్లెస్ మార్టిన్‌తో కలసి వివరించారు. అనంతరం దాతలను ఈ సందర్భంగా ఈఓ ధర్మారెడ్డి అభినందించారు. అనంతరం జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద లగేజీ కౌంటర్లను, పనితీరును పరిశీలించారు.

# జగనన్నకు ఆప్యాయతను రిటర్న్ గిఫ్టుగా ఇద్దాం

**- మంత్రి రోజా**

నగరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



పలు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ప్రజలను ఆదుకుంటూ అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథకం లో నడిపిస్తున్న జగనన్న విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించ డానికి నగరి పట్టణానికి విచ్చేస్తున్నారని మన ఆప్యాయతను ఆయనకు రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చి ఆయనకు ఘన స్వాగతం పలుకుదామని మంత్రి రోజా అన్నారు. మంగలవారం నగరి మున్సిపాలిటీ, మండల నాయకులతో ఆమె సమావేశమయ్యారు. సమావేశంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వమణి, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్‌లు బాలన్, వెంకటరత్నంరెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నయప్ప, ఢిల్లీ, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మండల కన్వీనర్ సుదర్శన్‌నాయుడు, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మున్సిపల్ మండల సచివాలయ కన్వీనర్లు దయానిధి, హరి, మున్సిపల్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



ముఖ్యమంత్రి నగరి పట్టణానికి ఈ నెల 28న విచ్చేయడాన్ని పురస్కరించుకుని భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం నగరి పట్టణానికి విచ్చేసిన ఆయన కీళపట్టు, డిగ్రీ కళాశాల మైదానాల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లను ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుంచి సభా స్థలికి చేరుకునే మార్గాలను పరిశీలించి ఆ ప్రాంతాల్లో చేపట్టవలసిన భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సురేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశకు

**కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22, ప్రభాతవార్త

తిరుపతిలోని ఆర్టిసి బస్టాండ్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న శ్రీనివాస సేతు తుది దశ పనులను మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. చివరగా మూడు సెగ్మెంట్లు అమర్చితే పనులు పూర్తి అవుతాయని అన్నారు. ఇప్పటికే మొదటి, రెండవ, మూడవ దశ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. వాహనాలను కూడా అనుమతించం జరిగిందన్నారు. తుది దశలో భాగంగా ఆర్టీసి బస్టాండ్ సమీపం వద్ద పనులుచేపట్టడం జరిగిందని, మరో నెలలోపు ఈ పనులు పూర్తి చేసి మొత్తం శ్రీనివాస సేతుప్రాజెక్టుని ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ మోహన్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, ఆప్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

# దళితుని మృతిపై పోలీసులకు వివక్ష తగదు

## -శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎదుట వామపక్షాల నిరసన

సత్యవేడు, ఆగష్టు22, ప్రభాతవార్త:



మండలంలోని రాచపాళ్యం కు చెందిన మన్నార్ కుమార్(35) అనే యువకుడు ఫిబ్రవరి నెల 27న గ్రామానికి సమీపంలోని కోనాక్షమ్మ ఆలయం వద్ధ రక్త గాయాలతో అనుమాస్పధ స్థితిలో పడిఉన్నాడు. ఇది గమనించిన గ్రామస్తులు కుమార్‌ను హాస్పిటల్‌కు తరలించి వైద్య చికిత్సలు అందించారు. వైద్య చికిత్స పొందుతూ అతను మార్చి 24న మరణించగా కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకుని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే గ్రామంలోని ఓ వ్యక్తి కుమార్ ప్రమాదవశాత్తు మరణించలేదని, కొందరు ఉద్దేశ్యపూర్వకముగా హత్య చేశారని చెప్పడంతో మృతుని భార్య గౌరమ్మ మార్చి 26న శ్రీసిటీ హైటెక్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భాదితురాలి ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేపట్టిన శ్రీసిటీ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పాతిపెట్టిన కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. నెలలు గడుస్తున్నా కేసులో పురోగతి లేకపోవడంతో భాదితురాలు న్యాయం కోసం వామపక్షాల సాయం కోరింది. దీంతో కెవిపిఎస్, సిపిఐ, సిపిఎం నాయకులు మంగళవారం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దళితుని మృతిపై వివక్షతతో వ్యవహరించడం పోలీసులకు తగదని మండిపడ్డారు. నిందితులు అగ్రకులాలకు చెందిన వారు కాబట్టే పోలీసులు చర్యలు చేపట్టడంలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. శ్రీసిటీ డిఎస్పీ జగదీష్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని, త్వరిత గతిన నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపడతామని హామి ఇవ్వడంతో వారు నిరసనను విరమింప చేశారు. ఈకార్యక్రమంలో వామపక్ష నాయకులు అరుణాచలం, చిన్నిరాజ్, జనార్ధన్, రమేష్ తదితరులు పాల్గోన్నారు.

# ద్రవిడ వర్సిటీ ఎంఫిల్..పిహెచ్‌డి పట్టాల పంపిణీలో నిర్లక్ష్యం

## గవర్నర్‌కు నివేదిక అందించిన జస్టిస్ శేషశయన రెడ్డి కమిటీ !!

## - పాత..ప్రస్తుత ఉపకులపకుల హయాంలోనే.. 15 రోజుల్లోగా వి.సి.వివరణ ఇవ్వాలి!!

## - ప్రభుత్వ గెజిట్‌లో పేర్కొన్న విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి !!



కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త

ద్రవిడ భాషలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పాతికేళ్ల క్రితం ఏర్పాటైన ద్రవిడ విశ్వవిద్యాలయంలో దూరవిద్యా విధానంలో ఎంఫిల్, పిహెచ్‌డి పట్టాల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు స్పష్టమైంది. యుజిసి నిబంధనలకు విరుద్ధంగా దూరవిద్య కేంద్రాల ద్వారా ప్రవేశాలు కల్పించడం, తగిన అధ్యాపకులు లేకపోవడంతో పాటు పట్టాల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రభుత్వానికి గతంలో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వర్సిటీలో జరిగిన ఎంఫిల్, పిహెచ్‌డి ప్రవేశాలు, పట్టాల పంపిణీపై తగు విచారణ నిమిత్తం హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ శేషశయనరెడ్డి నేతృత్వంలో కమిటీ నియమించారు. ఈమేరకు ద్రవిడ వర్సిటీలో జరిగిన పిహెచ్‌డి ప్రవేశాలపై విచారణ జరిపిన జస్టిస్ శేషశయన రెడ్డి బృందం రాష్ట్ర గవర్నర్‌కు నివేదిక అందించింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్య శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణను 15 రోజుల్లోగా తగు వివరణ ఇవ్వాలని ప్రభుత్వ గెజిట్ ద్వారా సంజాయిషీ కోరారు. ఈ వ్యవహారంలో మాజీ విసి ఆచార్య ఈడిగ సత్యనారాయణను సైతం సంజాయిషీ కోరినట్లు తెలిసింది. వర్సిటీలో జరిగిన ఎంఫిల్, పిహెచ్‌డి ప్రవేశాలకు సంబంధించి పాత, ప్రస్తుత ఉపకులపతులు నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వ్యవహరించారని జస్టిస్ శేషశయనరెడ్డి తన నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉపకులపతిపై చర్యలు తీసుకుని ఎందుకు విధులనుంచి తొలగించరాదని ప్రభుత్వ గెజిట్‌లో ప్రశ్నించారు. ఈ ఉత్తర్వులు అందిన 15 రోజుల్లోగా ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఏదైనా సంజాయిషీ ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఏదేని వివరణ ఇవ్వకుంటే లేదా స్పందించకుంటే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర గవర్నర్ ఆదేశాలతో జారీ చేసిన గెజిట్‌లో ఉన్నత విద్య శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి పేర్కొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

గుడుపల్లె, ఆగస్టు 22 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చితూ_రు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఒఎన్ కొత్తూరు పంచాయతీ శ్రీనివాసపురం, కృష్ణరాజపురం, కొండసముద్రం,సి.అగ్రహారం గ్రామాల్లో ఆయన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ధి కలుగుతోందన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటిసి కృష్ణమూర్తి, ఎంపిపి వరలక్ష్మి, కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ రామూర్తి, వెంకటేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ

నింద్ర, ఆగస్టు 22 ప్రభాతవార్త:

మండలంలోని నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యంకు రెవెన్యూ రికవరీ యాక్టు నోటీసులు నింద్ర తహసీల్దార్ అమరేంద్రబాబు అందజేసినట్లు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతమ్స్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం 2019-20 సంవత్సరంలో చెరకు సరఫరా చేసుకుని రైతులకు 36 కోట్లు బకాయిలు చెల్లించలేదు. అదే ప్రకారంగా ఎస్టీసీఐ ముంబై(ఫైనాన్స్ కంపెనీ) నుంచి 63.19 కోట్లు బకాయిలు కోర్టుకు సమర్పించుకున్నారని వారి బకాయిలు, రైతులు బకాయిలపై స్పందించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ రికవరీ నోటీసులు యాజమాన్యానికి పంపించడం జరిగింది. దీని ప్రకారం ఈ నెల 24వ తేదీ గడువు ముగిస్తుంది. ఈ గడువు తేదీ లోపు ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోతే తదిపరి నోటీసు జారీ చేసి దాని ప్రకారంగా ఫ్యాక్టరీ యాజమాన్యంకు సంబంధించి ఆస్తులపై నోటీసు ఇచ్చి దానిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## శింగిరికోన లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్వాతి నక్షత్ర పూజలు

నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామపరిధిలోని శింగిరికోనలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ంలో మంగళవారం సా ్వతి నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లను పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీరు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ పి గుణవంతరావు, సభ్యులు పి గిరిబాబు, భాస్కర్‌బాబు, మదు, అర్చకులు హరిబాబుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటిఐ మూడవదశ ప్రవేశమునకు ధరఖాస్తులు ఆహ్వానం

కార్వేటినగరం,ఆగస్టు 22 ప్రభాతవార్త:

కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ నందు వివిధ ట్రేడులలో మూడవదశ ప్రవేశమునకు ఈనెల 21నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ ఇ.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 22నుండి 27వ తేది లోపు కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ నందు తమ పదవతరగతి మార్కులిస్టు,బదిలీసర్టిఫికెట్,ఆధార్‌కార్డు,కులధృవీకరణపత్రం,పాస్‌పోర్టు సైజుపోటోలు,ధరఖాస్తుకు జతపరిచి ఇవ్వాలన్నారు. మహిళలకు డ్రస్‌మేకింగ్ ట్రేడ్ నందు శిక్షణ ఇవ్వబడునన్నారు. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమయొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 30వ తేదీన కార్వేటినగరం ఐటిఐ నందు జరుగు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

## కుప్పం డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని కుప్పం డిగ్రీ కాలేజీకు నాక్ బిప్లస్‌ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే లక్ష్య ంగా బిసిఎన్ విద్యాసంస్థల్ని తాము స్థాపించామన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు కళాశాలలో నాక్ బృందం పర్యటించి అన్ని విభాగాలు తనిఖీ చేసిందన్నారు. తరగతి గదులు, విద్యాప్రమాణాలు, ల్యాబ్, లైబ్రరీ, మైదానం, అధ్యాపకులు, రవాణా సౌకర్యం తదితరాలపై నివేదికలు రూపొందించి సంతృప్తి వ్యక్తం చేశార న్నారు. కాలేజ్ ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ కుప్పం డిగ్రీ కాలేజ్ చిత్తూరు జిల్లాలో నాక్ గుర్తింపు పొందిన రెండో ప్రైవేట్ కాలేజ్ అన్నారు. నాక్ గుర్తింపు రావడం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 121పెద్దూరులో మహాశక్తి పథకాల ప్రచారం

శాంతిపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త



మండలంలోని 121 పెద్దూరులో తెదేపా మహాశక్తి పథకాల గురించి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ అధ్వర్యంలో తెలుగు మహిళలు ప్రచారం నిర్వహించారు. మహిళల సంక్షేమంకోసం తెదేపా అధినేత చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారన్నారు. మహిళలు వచ్చే ఎన్నికల్లో తెదేపాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి శకుంతల, మాజీ ఎంపిపి పుష్ప, పొలారాణి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో అక్రమ బియ్యం డంప్ పట్టివేత

వి.కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త



మండలపరిధి నాయకనేరి అటవీ ప్రాంతంలో బియ్యం స్మగ్లర్లు అక్రమంగా డంప్ చేసిన బియ ం బస్తాలను వి.కోట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలో పేదలకు అందించే బియ్యంను నాయకనేరికి చెందిన స్మగ్లర్ అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు గాను అటవీ ప్రాంతంలో డంప్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. సంఘటనా స్థలికి ఇటు వి.కోట, అటు తమిళ పోలీసులు చేరుకున్నారు. బియ్యంను తమిళనాడు పోలీసులు స్వాధీనం చేసుకుని తమిళనాడుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- తెదేపా కన్వీనర్ చంద్రశేఖర్

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త



కుప్పం అభివృద్ధి తెదేపా అధినేత చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని కుప్పం తెదేపా కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, సైకిల్ యాత్ర కో ఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపల్లి పంచాయతీలో తెలుగుయువత అధ్వర్యంలో సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం మరింత అభివృద్ధి కావాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. వైకాపా పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అనంతరం గ్రామాల్లో యువత సైకిల్ యాత్ర కొనసాగించారు. కార్యక్రమాల్లో నేతలు మునిరాజు, బాబునాయుడు, బేటప్పనాయుడు, హేమాంబరగౌడు, డా॥ వెంకటేష్, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జిల్లా విద్యార్ధులలో కరాటే విప్లవం తీసుకువస్తాం

-జిల్లా కార్యదర్శి రెడ్డి మహేష్ వెల్లడి

-ప్రతి మండలానికి ఒక శాఖ ఏర్పాటు

పుంగనూరు,ఆగస్టు 22 ప్రబాతవార్త :



చిత్తూరు జిల్లా విద్యార్థులలో కరాటే విప్లవాన్ని తీసుకువచ్చి వారికి శారీరకదృఢత్వాన్ని, పోరాటపటిమ, ఆత్మరక్షణ విధానాలను నేర్పి శక్తివంతమైన యువతగా తీర్చిదిద్దేందుకు జిల్లా వ్యాప్తంగా శాఖలు ఏర్పాటు చేస్తున్నటు ్ల చిత్తూరుజిల్లా కరాటే అసోషియేషన్ ప్రధాన కార్య దర్శి రెడ్డిమహేష్ వెల్లడించారు. మంగళవారం పట్టణంలో జిల్లా కార్యవర్గ ఎన్నిక ,సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలకు చిన్నతనం నుంచే కరాటే విద్యను నేర్పడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సంఘ ఛైర్మన్‌గా ఎన్నికయిన డాక్టర్ శరణ్‌కుమార్ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. నేటి విద్యావ్యవస్థలో క్రీడలకు తల్లితండ్రులే ప్రాధాన్యత ఇవ్వడంలేదని, పిల్లలను టెక్నోలలో చేర్చడం మాత్రమే వారు ఆలోచిస్తున్నారన్నారు. కరాటే ద్వారా పిల్లలకు మంచి శారీరక పటుత్వం వస్తుందన్నారు.ఈసందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు.

## జిల్లా కరాటే సంఘానికి కొత్త బాధ్యులు

పుంగనూరు,ఆగస్టు 22 ప్రభాతవార్త



చిత్తూరుజిల్లా కరాటే అసోషియేషన్‌కు కొత్త కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కరాటే అసోషియేషన్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం కలిగి,ఏపి ఒలెంపిక్ అసోషియేషన్ ద్వారా రిజిష్టర్ కాబడిన కరాటే అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ ్యక్షుడు కోలాప్రతాప్‌కుమార్ ఈమేరకు వారికి నియామక అనుమతులు పంపారు. రాష్ట్ర సంఘ నిబంధనలమేరకు సంఘ అధ్యక్షుడుగా టి.సునీల్,ప్రధాన కార్యదర్శిగా ఎం.రెడ్డిమహేష్‌లు ఎన్నికయ్యారు.కాగా సంఘ గౌరవ ఛైర్మన్‌గా మల్లెలసుధాకరరెడ్డి, సాంకేతిక విభాగ డైరెక్టర్‌గా వి.హేమంత్, ఉపాధ్యక్షులుగా బి.సాయితేజ, కోశాధికారిగా సి.ఆర్.నిఖిల్, కార్యవర్గసభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి,వి.కిరణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

## రికార్డుస్థాయిలో రోటరీచే 80యూనిట్ల రక్తం సేకరణ

-ప్రశంసించిన పట్టణం

పుంగనూరు,ఆగస్టు 22 ప్రభాతవార్త :



రోటరీక్లబ్,మానవత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏకంగా 80 మంది యువకులు రక్తదానం చేయడంతో పలువురు ప్రశంసిస్తున్నారు. రోటరీ నూతన అధ్యక్షుడు అనిల్,కార్యదర్శి సిఎస్ రాజారెడ్డిలు ఎన్నికయిన వెంటనే రెండో కార్యక్రమంగా రక్తదాన శిబిరం నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్ర బ్లడ్ బ్యాంకుకు మద్దతుగా సాగిన ఈకార్యక్రమంపై గత వారం రోజులుగా ప్రచారం నిర్వహించడంతోపాటూ శుభారాం ప్రభుత్వ ఎన్‌సిసి విభాగం సహకారంతో 80 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని డాక్టర్ ప్రభాకర్,డాక్టర్ శరణ్‌కుమార్,పూలత్యాగరాజు తదితరుల సారథ్యంలో నిర్వహిం చారు. మానవతసంస్థనిర్వాహకులునందీశ్వర,నారాయణరెడ్డి,హరినాథరెడ్డిలుకార్యక్రమాలను పర్యవేక్షించారు.

## డిఐఒచే ఆరోగ్యకేంద్రం తనిఖీ

శాంతిపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా॥ రవిరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, ప్రసద్, గుణశేఖర్, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైసీపీ ప్రభుత్వంలోనే పేదలందరికీ సంక్షేమ పథకాలు

- నేదురుమల్లి

వెంకటగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పంజాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతికికి తావు లేకుండా అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చెరువుకు తెలుగుగంగ నీరు ఇప్పించాలని, తాగునీటి తదితర సమస్యలను రామ్‌కుమార్‌రెడ్డికి తెలపగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాసులురెడ్డి, నాగయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, ఎంఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయం ఎదుట మసీదును నిర్మిస్తే ఆందోళన

- బీజేపీ నేతల హెచ్చరిక

వెంకటగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త:



వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఎదురుగా మసీదును నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా యని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్, మాజీ నియోజకవర్గ కన్వీనర్ టి.టి.మణి తెలిపారు. గుడి ఎదురుగా పేర్లతో స్థలం పక్కన రాజాలిచ్చిన వంట స్థలం ఉందని, ఇక్కడ మసీదు నిర్మాణానికి ముస్లింలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పోలేరమ్మ గుడికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగు తుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

## 2024లో తెలుగుదేశం పార్టీదే అధికారం

- డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త:



2024 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీదే అధికారమని సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మస్తాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలో బంగారుపేటలో భవిష్యత్తు గ్యారంటీ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. మన ఇంటికి - మన డాక్టర్ మస్తాన్ అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరవుతున్నట్లు తెలిపారు. 1వ వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గంలో టీడీపీ జజెండాను ఎగురవేసి తమ పార్టీని అధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో మీ కష్టాలు పరిష్కారమయ్యే విధంగా తాను కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు స్థానిక టీడీపీ నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు పాల్గొన్నారు.

## కోత్తపాలెంలో ప్రాధమిక పాఠశాల తనిఖీ

కోట,ఆగస్టు 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని నెల్లూరు పల్లి కోత్తపాళెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఇఒ మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డు లను ఆయన నిశితంగా



పరిశీలించారు. అనంతరం విద్యార్దులు సామర్ధ్యని పరిశీలించారు, బ్లాక్ బోర్డు పై విద్యార్దులు చేత రాయించారు.ప్రభుత్వం అందించిన జగనన్న కీట్ల అందరికి అందాయో లేదానిని విద్యార్దులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మోనులో రాజీ పడవద్దని ఖచ్చితంగా మోను పాటించాలని సూచించారు.

## ఆర్ధిక అభివృద్ధి ద్వారా మహిళలు ఎదగాలి

వాకాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త



సంఘాలకు ఇచ్చినటువంటి రుణాలు సకాలంలో చెల్లించి, కొత్త రుణాలు తీసుకుని ఆర్థిక అభివృద్ధి చేసుకుని ఆస్తులు కొనుగోలు చేసుకోని అభివృద్ధి చెందాలని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ప్రభావతి అన్నారు. మంగళవారం వాకాడులోని వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు వివోఏలకు, సమీక్ష సమావేశం జరిగింది. ఏపిడి ప్రభావతి మాట్లాడుతూ గ్రామ సమైక్యలు, సంఘాలు సమావేశాలు నిరంతరం జరుపుకోవాలని సూచించారు. సంఘాలకు ఇచ్చినటువంటి రుణాలు కాలంలో చెల్లించి, అతి తక్కువ వడ్డీకి కొత్త రుణాలు మహిళలు అభివృద్ధి చెందాలని తెలిపారు. ఆర్థిక అభివృద్ధి చేసుకుని ఆస్తులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. సంఘాలు ఎప్పటికీ అప్పుడు వివోఏలకు, సిసిలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ వెంకట్రావు, స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్, ఎఫ్ఈఓ డిపిఎం సింగన్న, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఏపీఎంలు, సిసిలు, వివోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో దుకాణాలపై దాడులు

వాకాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త



మండల కేంద్రమైన వాకాడులోని మంగళవారం కార్మిక శాఖ అధికారులు పలు దుకాణంలో బాలకార్మికులు పనిచేస్తున్నారన్న విషయంపై తనిఖీలు చేపట్టారు. వాకాడు గ్రామంలోని బజారు వీధి, బీసీ కాలనీ, అశోక్ పిల్లర్ సెంటర్ సమీపంలోని దుకాణాలను వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ నరేష్ మాట్లాడుతూ కూల్‌డింక్ షాపులు దుకాణాల్లో , బాల కార్మికుల పని చేస్తున్నారన్న విషయంపై తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేరు గోప్యంగా ఉంచుతామన్నారన్న సమాచారం ఇస్తే నిర్వాహలు పై చట్టరిత్య చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో లేబర్ ఆఫీసర్లు సత్యనారాయణ, అనిల్ కుమార్, రెవెన్యూ ఇన్స్‌ఫెక్టర్ సెల్వరాజ్, వాకాడు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టిడిపి నుండి వైకాపాలో చేరిక

వాకాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త



మండల పరిధిలోని రాయిగుంటపాలెం పంచాయితీ 6వ వార్డు సభ్యుడు టిడిపి మద్దతుదారుడు ఇలాప. తిరుపాలయ్య మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో వైకాపాలో చేరారు. వాకాడు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రావిగుంటపాలెం పంచాయితీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, వార్డు సభ్యుడు తిరుపాలయ్య అభిప్రాయ వ్యక్తం చేసారు. అటువంటి వారికి మద్దతుతో ఇవ్వాల్సి న ఆవశ్యకత ఉందన్నారు. ఆయనతో పాటు ఇంగిలాల చిట్టి కూడా, వైకాపాలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద రావు వారిని అభినందించారు. అజిత్ కుమార్ రెడ్డి రావిగుంట పాలెం పంచాయితీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులుతో పాటు, శాశ్వత అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, జడ్పిటిసి రౌతు రామకృష్ణ, మాజీ ఎంపిపి మధుసూధన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి వంకా రమణయ్య, మాజీ సర్పంచ్ వెంకటాద్రి, వైకాపా నాయకులు, కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంతాలలో తుఫాన్ షెల్టర్ల పరిశీలన

తడ, ఆగస్టు 22, ప్రభాతవార్త



తడ మండలంలోని తీరప్రాంత గ్రామాలలో వున్న తుఫాను షెల్టర్లను మంగళవారం తహశీల్దారు కె. జయజయరావు పరిశీలించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు వర్షాకాలం సమయంలో తీరప్రాంత పల్లెలు, దీవుల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని కారిజాత, వాటంబేడు, చిన మాంబట్టు, వేనాడు, ఇరకంలలో తుఫాను షెల్టర్లు శిథిలమై పోయాయని తహశీల్దార్ గుర్తించారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలు తిరిగి నిర్మించాలని నివేదికలు పంపించారు.

## అధికారం అండగా అక్రమాలు

కోట,ఆగస్టు 22 ప్రభాతవార్త



ఇసుకను తరలించకూడదని కోర్టులు నిషేదించినా తీర ప్రాంతంలో మాత్రం ఇసుకను అధికార పార్టీ వారు దోచుకో..దాచుకో అన్నట్లు గా వ్యహరిస్తున్నారని మాజీ ఎంపిటిసి సభులు చెంగల్ రాయుడు ఆరోపించారు మంగళవారం కోత్తపట్నం గ్రామ పంచాయతీలోని మైనింగ్ ప్రాంతంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అధికార పార్టీ నాయకుల పై .అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకొవాలని ఆయన డిమాండు చేశారు.కొందర నాయకుల అండదండలతో పగలు ఇసుకను డంప్ చేసుకుని రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. వైకాపా ప్రభుత్వం వచ్చినప్పుట నుంచి ఇసుకను ఎక్కడపడితే అక్కడ అక్రమంగా ఇసుకను తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని చెప్పారు. రోజూ రాత్రి సమయంలో గోవిందపల్లి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందన్నారు.మండలంలో అక్రమ ఇసుక రవాణా విషయమై ఆర్డీఓ, మండల తహిశీల్దార్ కు పిర్యాదులు కూడా చేశామని ఆయన గుర్తు చేశారు. మన ప్రాంతాన్ని మనం కాపాడుకొకపోతే భవిష్యత్ ప్రజలు సాగు నీరు కు తాగు నీరుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై సెబ్ పోలీసులు, పోలీసులు, రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకొవాలని ఆయన కోరారు.ఇసుకను తవ్వేసిన ప్రాంతాన్ని ఆయన మీడియాకు చూపించారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

వడమాలపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త:



సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల తమకు జీతాలు ఇవ్వనందుకు మంగళవారం నిరసన తెలిపారు. విద్యాశాఖలో 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఎలాంటి బెనిఫిట్‌లు ఇవ్వలేదని, శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వడమాలపేట ఎమ్మార్సీ కార్యాలయం ప్లేకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు.

## శ్మశాన వాటికకు బౌండరీ ట్రెంచ్ నిర్మాణం

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:



వేపగుంట పంచాయతీ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా వేచి చూస్తున్న శ్మశాన వాటిక అందుబాటులోకి రావడం కోసం ఎంపీపీ మునివేలు దీనిపై తక్షణమే వేపగుంట ప్రజలకు శ్మశాన స్థలం కేటాయించాలని మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి దీనిపై తక్షణమే వేపగుంట ప్రజలకు అవసరమైన శ్మశాన స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో తహసీల్దార్ వారు వేపగుంట వారికి శ్మశాన స్థలం కేటాయించడం జరిగింది. అలా కేటాయించిన శ్మశాన స్థలంలో ఉపాధిహామీ పథకంలో శ్మశాన స్థలానికి బౌండరీ ట్రెంచ్ నిర్మాణం ఉపాధిహామీ కూలీల ద్వారా చేపట్టడం జరిగింది. ఈ విధంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వేపగుంట ప్రజలకు శ్మశాన స్థలం కేటాయించినందు మంత్రికి, ఎంపీపీ మునివేలు, వేపగుంట ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ శ్మశాన వాటికకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చి వీలైనంత త్వరగా మంత్రిచే ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఆచరణలోకి రావడానికి సహకరించిన మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి - మంత్రి రోజా

వడమాలపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి రోజా సూచించారు. మంగళవారం వడమాలపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవోకార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉండే మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి అని కొనియాడారు. గడప గడపకు, జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు, కావాల్సిన అభివృద్ధి పనులు గుర్తించామన్నారు. మండలానికి మంజూరైన అభివృద్ధి పనులు, నాడు–నేడు స్కూలు రెన్యువేషన్ పనులను ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ సంబంధించిన వర్కులన్నీ పూర్తి చేయమని కోరారు. ఈ నెల 28 తేదీ జగనన్న విద్యా దీవెన పథకాన్ని లాంఛనంగా




ప్రారంభించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నగరి పట్టణానికి వస్తున్నారని మన నాయకుడికి ఘనస్వాగతం పలకడానికి అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జగనన్న హౌసింగ్ పథకంలో మండలానికి 945 ఇళ్లు మంజూరు కాగా 296 పూర్తి అయ్యాయని, 452 నిర్మాణంలో ఉన్నట్లు ఏఈ తెలిపారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సర్వే 90 శాతం పూర్తయినట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా పథకంలోరూ.28.20 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు ఏపీఎం మురళీకృష్ణారెడ్డి తెలిపారు. శ్రీ బొమ్మరాజపురంకు డంపింగ్ యార్డు స్థలం కోసం గతమూడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని స్థానిక సర్పంచ్ మణిరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ కంటి వెలుగు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమం విజయవంతంచేయడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల వైద్యాధికారి చక్రపాణి కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో భానుమూర్తి, వైస్ ఎంపీపీ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సి.గొల్లపల్లిలో చెవిరెడ్డి లక్ష్మీకి అడుగడుగున ఆత్మీయత

–2024లో మోహిత్‌రెడ్డిని గెలిపించాలని పిలుపు

తిరుపతిరూరల్, ఆగస్టు22 ప్రభాతవార్త:



2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ కోరారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం మంగళవారం సి.గొల్లపల్లిలో నిర్వహించారు. తిరుపతిరూరల్ మండలంలో, సి.గొల్లపల్లిలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగారు. మహిళలు పెత్తున స్వాగతం పలుకుతూ ఆమె వెంట నడిచారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘాల ఆధ్వర్యంలో పోలాక్షమ్మ గుడిలోకి దళితులు ప్రవేశం

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం రామకృష్ణాపురం గ్రామంలోని శ్రీ పోలాక్షమ్మ అమ్మవారి దేవాలయంలోకి దళితులకు అనుమతి లేదంటూ గత కొద్ది రోజులుగా జరుగుతున్న వివాదం సర్దుమణిగింది. తిరుపతి జిల్లా కలెక్టర్ జోక్యంతో ఎస్ఐ, తహసీల్దార్, సీపీఐ, సీపీఎం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు దగ్గరుండి దళితులకు ఆలయ ప్రవేశం కల్పించారు. దీంతో గొల్లపల్లి గ్రామ దళితులు పోలాక్షమ్మ తిరుణాళ్ళను పొంగళ్లు పెట్టి ధూపదీప నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భవిష్యత్‌లో ఆలయానికి తాళాలు వేయడం జరిగిందని ఆలయ ఛైర్మన్‌తో మాట్లాడి ఆలయ కమిటీలో దళితులు కూడా చోటు కల్పించారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మురళి, వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో గ్రామస్థులను దళితులను మధ్య చర్చలు నిర్వహించి వివక్షత వీడి కలసి మెలిసి జీవించాలని సూచించారు. ఇలాంటిసంఘటనలు తలెత్తినప్పుడు గ్రామ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిచిన్నం కాళయ్యా, జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, ఆర్.బలరాం,జయచంద్ర,అంబేద్కర్‌ఆర్మీడా.గోపి,జైభీమ్,శ్రీకాంత్, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

## మధన్న వెంటే జనం...జనం కోసం మధన్న

రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:



జనం కోసం మధన్న...మధన్న వెంట జనం ఉన్నారని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం అత్తూరు పంచాయతీ ఏటి ఒడ్డున ఇల్లు, అత్తూరు గ్రామం, దళితవాడ, అరుంధతివాడ, అమ్మవారిపట్టెడ, ఎస్టీ కాలనీ, చెర్లో ఇల్లు ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పలు ప్రారంభోత్సవాలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకగా మహిళలు మంగళ హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే ప్రజలతో మమేకమై అధికారులతో మాట్లాడి అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. గడప గడపకు తిరిగిన వారిలో తహసీల్దార్ ఉదయసంతోష్, ఈవోపీఆర్‌డీ రత్నమ్మ, రూరల్ సీఐ సుబ్బరాయుడు, జడ్పీటీసీ సంధ్యారాణి, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు డా. గంగారి రమేష్, నాగేషం, మునిశేఖర్‌రెడ్డి, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీలు శశికిరణ్, ఆనందరావు, వైసీపీ నేతలు శ్రీధర్‌రెడ్డి, బెనర్జీ, మహిళా నాయకురాలు అరుణాదేవి, వివిధశాఖల మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 27లోపు ఐటిఐకు దరఖాస్తు చేసుకోవాలి

విజయపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త :

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద వున్న ప్రభుత్వ ఐటిఐలో 2023–24 సంవత్సరానికి సంబంధించి మూడో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వ తేదీ సాయంత్రం అయిదు గంటల వరకూ గడువు వున్నట్టు ప్రిన్సిపల్ గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి వున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐటిఐ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. సర్టిఫికెట్ల నకలు కాపీలకు, ఫోటో జత చేసి ఐటిఐలో సమర్పించవచ్చని తెలిపారు. కాలేజీలో ఎలక్ట్రానిక్ మెకానిక్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్స్, ఫిట్టర్, డ్రాఫ్‌మెన్ సివిల్, వెల్డర్ విభాగాలున్నాయని తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు వెల్డర్ విభాగానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఉదయం పది గంటల లోపు అభ్యర్థులు కాలేజీకి హాజరు కావాలన్నారు. వివరాలకు కాలేజీ సిబ్బంది 8639790174, 6303156450, 9494434236, 9177035120, 9441449765, 6302478708 మొబైల్ ఫోన్‌లకు సంప్రదించాలని తెలిపారు.

## కైలాసగిరులను సర్వే చేయాలి..తెదేపా నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త



రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కైలాసగిరి పర్వతాలను సర్వే చేయించాలని శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశంపార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పలువురు తేదేపా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నాటి బ్రిటీష్ ప్రభుత్వం తయారు చేయించి అప్పగించిన అప్పటి ప్లాన్ ప్రకారం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఆస్తిగా ప్రకటించబడిన కైలాసగిరి పర్వతాలలోని విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన దేవస్థానం అధికారులు అలసత్వం ప్రదర్శించడం కారణంగానే కైలాసగిరి పర్వత పరిసరాల్లో భూదోపిడీ యదేచ్ఛగా జరుగుతోందని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి భక్తులు ఎంతో పవిత్రంగా భావించే గిరిప్రదక్షిణ కార్యక్రమానికి హజరయ్యే వారికి సౌకర్యవంతంగా ఉండాలని గుర్తించిన మాజీ మంత్రివర్యులు, నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ దివంగత నేత స్వర్గీయ బొజ్జలగోపాలకృష్ణారెడ్డి మరియు అప్పటి ధర్మకర్తల మండలి చొరవ తీసుకుని కైలాసగిరి చుట్టు సిమెంటు రోడ్డు వేయించారని తెలుగుదేశంపార్టీ నాయకులు గుర్తుచేశారు. సిసి రోడ్డు నిర్మాణం పూర్తిచేసిన వద్ద నుంచి కైలాసగిరి పర్వతాల చుట్టు ఉన్న భూములు అమాంతం విలువ పెరిగిపోయి దురాక్రమణలు ఎక్కువయ్యాయని తెలుగుదేశంపార్టీ నాయకులు ఆరోపించారు. రాజీవ్‌నగర్‌లో సుమారు ఐదువేల పట్టాలు అక్రమార్కుల చేతుల్లో ఉన్నట్లు వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టకపోవడంలో అధికార వైసిపి నాయకుల హస్తం ఉందని పార్టీ నాయకులు ఆరోపించారు. శివయ్య ఆస్తులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలుతీసుకోవాలని దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులను కోరుతూ త్వరలో వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, పార్టీ రైతు విభాగం తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి జిలానీ, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, పట్టణ సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు డివి.నారాయణ, మాజీ డైరెక్టర్ షేక్.ఖాదర్‌బాషా, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాలభాస్కర్, మణి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ ఫాస్టర్స్ అసోసియేషన్ చర్చిలో తెట్టు వద్ద ఉన్న చర్చిలో నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. గౌరవాధ్యక్షులు ఫాస్టర్ సుందరరాజన్, వర్కింగ్ అధ్యక్షులు ఫాస్టర్ జీవమణి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆంబ్రోస్, ప్రధాన కార్యదర్శిగా ఫాస్టర్ రవిద్యాని, కోశాధికారిగా రఫెల్, ఉపాధ్యక్షులుగా ఫాస్టర్‌మణిబాబు, ఫాస్టర్ ఆశీర్వాదం, సంయుక్త కార్యదర్శిగా ఫాస్టర్ ఎలీషా, ఫాస్టర్ జోసఫ్, ఫాస్టర్ శ్యాంపాల్ సలహాదారుగా ఎలుమలై, రెవరెండ్ రవికుమార్, ఫాస్టర్ నవీన్, ఫాస్టర్ జాకరయ్య, ఫాస్టర్ కెసి. ప్రేమ సుందర్, ఫాస్టర్ భాస్కర్, న్యాయసలహాదారుగా విజయ్‌కిరణ్, ట్రెజరర్‌గా ఫాస్టర్ ఫాస్టర్ నహుం, చీఫ్ అడ్వైజర్‌గా ఫాస్టర్ దేవనేషన్, ఫాస్టర్ విజయకుమార్, ఫాస్టర్ లూకా, ఫ్టార్ కొండయ్య, కమిటీ సభ్యులుగా ఫాస్టర్ ప్రేమానందం, ఫాస్టర్ జోసెప్, బ్రదర్ రమేష్, ఫాస్టర్ లాజర్, ఫాస్టర్ లెనిన్‌బాబు, ఫాస్టర్ బత్తెయ్య, ఫాస్టర్ ఐసాక్, ఫాస్టర్ దేవసహాయం, బ్రదర్ రాజేంద్రప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త



వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సిఆర్‌సి మహిళా విభాగం డిప్యుటీ ఛైర్‌పర్సన్ వినుకొండ మాధురి అన్నారు. మంగళవారం మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సిఆర్‌సి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాధురి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్‌సిఆర్‌సి ఎంతో కృషిచేస్తోందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24న అమలులోకి వస్తుందన్నారు. సాంకేతికత పెరగడంతో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, టెలిమార్కెంటింగ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువుల్లో ఏవైనా లోపాలుంటే కమిషన్‌కు పిర్యాదు చేయవచ్చన్నారు. వస్తువు కొనేటపుడు బిల్లు, ఆన్‌లైన్ పేమెంట్ చేసిన తర్వాత ఇన్‌వాయిస్‌లను, ఐడీలను భద్రపరచుకోవాలని పిర్యాదు సమయంలో వాటిని సమర్పించాల్సి ఉందన్నారు. లేదా 1915, 1800114000 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి పిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిఆర్‌సి డిప్యుటీ ఛైర్మన్ కోటేశ్వరబాబు, పిఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు వెంకటకిషోర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధిక, రాష్ట్ర ఆర్టీఐ ఇన్‌ఛార్జి భరత్‌కుమార్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు శంకర్‌సుజిత్, కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, పిడి నరసింహరావు, కామర్స్ అధ్యాపకురాలు సాహితీ కళాశాల సిబ్బంది తదితరులుల పాల్గొన్నారు.

## విద్యార్ధులకు విద్యాసామగ్రి వితరణ

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త



పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు మెగా ఫ్యాన్స్ ఇన్‌ఛార్జి మాధవ మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా ఆస్పత్రిలో ఉన్న గర్భవతులు, బాలింతలకు రొట్టెలు, పండ్లు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా మండలంలోని పెన్నలపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్ధులకు విద్యాసామగ్రిని అందించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి కొట్టేసాయి మాట్లాడుతూ చిరంజీవి స్ఫూర్తితో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అలాగే ప్రతి అభిమాని జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేసే విధంగా కార్యాచరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అరిగలవేణుగోపాల్, వీరమహిళ సునీత, రామ్‌చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు గంధం రాఘవ, ఆనంద్, పేట చంద్ర, చిరంజీవి, గణేష్, రజనీకాంత్, లీలాధర్, రంజిత్, నారాయణ, జనసైనికులు మరియు మెగా అభిమానులు పాల్గొన్నారు.

## వాడ వాడల్లో చిరంజీవి జన్మదిన వేడుకలు: అన్నదానాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వాడ వాడల్లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, జనసేన నాయకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాలు, నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. మంగళవారం మెగా ఫ్యాన్స్ ఇన్‌చార్జి మాధవ మహేష్ సారథ్యంలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా చిరంజీవి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. యువతను ఉర్రూతలూగిస్తూ తనదైన శైలిలో సినిమాల్లో నటించి రాణించారన్నారు. సినీ పరిశ్రమల్లో కొత్తవారికి అవకాశాలు రావటం కష్టంగా ఉన్న రోజుల్లో చిరంజీవి స్వయంకృషితో సినీ పరిశ్రమలు తన స్థానాన్ని పదిలపరచుకున్నారన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, అరిగలవేణు గోపాల్, వీర మహిళ సునీత, రామ్‌చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు గంధం రాఘం, అనంద్, పేట చంద్ర, పేటచిరంజీవి, ఈర్ధచిరంజీవి, గణేష్, రజనీకాంత్, లీలాధర్, రంజిత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పొదుపు రూ.200: ప్రతిసంఘానికి రూ.500లు చెల్లించాలి!!

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త



గ్రామాల్లోనూ, పట్టణాల్లో పొదుపు సంఘాలు బలోపేతం కావాలని, మహిళలను ఆర్థికంగా మహారాణులు చేయటానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని ఏరియా కోఆర్డినేటర్ కెవి దినేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని స్త్రీశక్తి భవనంలో వైయస్ఆర్ క్రాంతి పథం సారధ్యంలో మహిళా సంఘాల సమావేశం జరిగింది. మహిళా సభ్యులనుద్దేశించి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంఘంలోనూ సభ్యులు వారి వ్యక్తిగత పొదుపులు రూ.200లకు తగ్గకుండా చేయాలని అలాగే గ్రామ సంఘానికి కనీసం రూ.500లు పొదుపు చెల్లించాలని, ప్రతి సంఘం సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశంలోనే పొదుపులు, అంతర్గత అప్పులు, ఉన్నతి, స్త్రీనిధి బ్యాంకులోన్స్ చెల్లింపు పుస్తకాలులో తప్పని సరిగా రాసుకోవాలని, ప్రతి సంఘం సంవత్సరానికి ఒక మారు క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించి సంఘం లావాదేవిలను సభ్యులందరికి తెలిసే విధంగా అవగాహన కల్పించాలని వివరించారు. కాగా ఎపిఎం మునెయ్య మాట్లాడుతూ సంఘం పటిష్టంగా ఉన్నపుడే ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందరికి అందుతాయని వివరించారు. ఈకార్యక్రమాల్లో ఎల్‌సిసి సి గెరటారెడ్డి, సిసిలు మాధవయ్య, శ్రీనివాసులు, మురళి, గంగులప్ప, యం.యస్ లీడర్లు అకౌంటెంట్లు, విఒలు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ డిస్ట్రిక్స్ పనులను పరిశీలించిన కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22, ప్రభాతవార్త

తిరుపతిలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఆర్ట్స్ డిస్ట్రిక్ట్ పనులను మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంలో భాగంగా స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు 40 కోట్ల రూపాయిలతో 600 మంది సిటింగ్ కెపాసిటితో కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా ఆడిటోరియం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆర్ట్ స్టూడియో, డిజైన్ స్టూడియోలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఆడిటోరియం, ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి



అయ్యాయని, సెప్టెంబరు 3వ తేదీ ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆడిటోరియం అందుబాటులోకి రావడంతో సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. ఆర్ట్స్ డిస్ట్రిక్ట్ పనులను వేగవంతం చేసి 3వ తేదీ ప్రారంభించేందుకు సిద్ధం చేసేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ దేవిక, ఏఈకాం సంస్థ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సింహవాహనంపై భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రుడు సాక్షాత్కారం

నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనం పంచాయతీ సముదాయం రోడ్డులో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు మంగళవారం రాత్రి సింహవాహనంపై ఊరేగారు. గ్రామవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామి,అమ్మవారికి స్నపనతిరుమంజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, పూజారి అయ్యప్ప, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మోసపు మాటల వలలో పడకండి

–ఉద్యోగులు,పెన్షనర్లు,నిరుద్యోగ యువతకు టిడిపి విజ్ఞప్తి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 22 ప్రభాతవార్త:



తాము అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు చేస్తామని,ఉద్యోగులకు ఎప్పటికప్పుడు రావాల్సిన డిఏలు పెండింగ్ లేకుండా చెల్లిస్తామని హామీ ఇచ్చి,అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల మూడు నెలలకు పైగా అవుతున్నా,ఏ ఒక్క హామీని అమలు చేయని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మోసపు మాటల వలలో పడకండని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు ఉద్యోగులు,పెన్షనర్లు,నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు.మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు ఇప్పటి వరకు 7 డిఏలు బకాయి ఉందని,అలాగే 11వ పిఆర్సీ అరియర్స్ కూడా చెల్లించలేదన్నారు.జేఏసి అమరావతి తరపున 50 రోజుల పాటు ఉద్యోగులు సమ్మె చేసిన మీదట అరియర్స్ 4 విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చినా,అది హామీ లాగే మిగిలిందన్నారు.కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి,అది నెరవేర్చకుండా వారిని సైతం మోసం చేశారని మండిపడ్డారు.ఆఖరికి ఉద్యోగులు దాచిపెట్టుకున్న పెన్షన్ డబ్బులను కూడా వేరే పథకాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్న సమయంలో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా,ఉద్యోగులకు,పెన్షనర్లకు ఏనాడూ జీతాల విషయంలో నిర్లక్ష్యం చేయలేదని,తెలంగాణతో సమానంగా మన ఉద్యోగులు కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. సమావేశంలో నేతలు గోపాల్‌నాయుడు,కె.సుధాకర్,కోనంగి శ్రీరాములు, ఆనంద యాదవ్,ధనంజయ పాల్గొన్నారు.

## జెడ్ఆర్‌యుసిసి సభ్యుడిగా డా॥పిసి.రాయులు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 22 ప్రభాతవార్త:



భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ,సౌత్ సెంట్రల్ రైల్వేస్(జెడ్ఆర్‌యుసిసి) సభ్యుడిగా తిరుపతికి చెందిన పిసిఆర్ వేర్ హౌసింగ్ లిమిటెడ్ ఛైర్మన్ డా॥పిసి.రాయులు నియమించబడ్డారు.ఈ పదవిలో ఆయన 2023 మే 31 నుండి రెండేళ్ల పాటు కొనసాగుతారు.ఆయన గత 20 ఏళ్లుగా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ద్వారా పేదలకు అనేక సేవలందిస్తూ,ఎఫ్‌సిఐ, ఎంఎస్ఎంఈ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయితీరాజ్ వంటి కేంద్ర మంత్రిత్వ శాఖలోని వివిధ కమిటీలలో సభ్యుడిగా ఉన్నారు.తన నియామకానికి కృషి చేసిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాని,ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆయన ఆదేశాల మేరకు పనిచేస్తానని డా॥పిసి.రాయులు తెలిపారు.

## ఆకట్టుకున్న కల్కి అవతార వైభవం శ్రోతలు

తిరుపతి (క్రీడా), ఆగస్టు 22, ప్రభాతవార్త



అన్నమాచార్య కళామందిరంలో రోజు వారీ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి రమేష్ బాబు కల్కి అవతార వైభవం శ్రోతలను బాగా ఆకట్టుకుంది. వీరిని రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య కళామందిరం సిబ్బంది కోకిల రమేష్, రంగస్థలం ప్రతినిధులు అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యే చేయండి

రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పార్టీ శ్రేణులతో కలసి మండలంలోని గుత్తివారిపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగారు. సుధీర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి తిరిగిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, టీడీపీ మైనారిటీ నేత రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ టీడీపీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా టీడీపీ నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, ఉదయకుమార్‌రెడ్డి, మండల నేతలు డి.పుష్పనాథం, కొరియర్ రవి, కన్నన్‌రెడ్డి, నగరి మునయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో అంధకారంలో గ్రామాలు

గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త :

వైసిపి పాలనలో విద్యుత్ రంగం అస్తవ్యస్తంగా మారిపోయిందని దాంతో ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో పలు గ్రామాలు అంధకారంలో మునిగిపోయాయన్నారు. వర్షాకాలంలో కూడా విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, వ్యవసాయానికి కూడా విద్యుత్ సరఫరా సకాలంలో, సక్రమంగా జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఒక రోజులో ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు కరెంట్ కోతలు అమలవుతున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో కరెంట్ సరఫరా లేకపోవడం వల్ల పిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్నపుడు రాష్ట్రంలో మిగులు విద్యుత్ వుండేదని, ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసిపి విద్యుత్ రంగాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. వైసిపి చేతకాని పాలన వల్లే ప్రజలు కరెంట్ కోతలు భరించాల్సి వస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపితేనే వెలుగులు వస్తాయని పేర్కొన్నారు.

## జనసేన సారధ్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త



మెగా స్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, కార్య కర్తలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా జనసేన నాయకురాలు కోట వినూత హాజరయ్యారు.ఈ సందర్భంగా చిరంజీవి జన్మదిన శుభాకాంక్షలంటూ భారీ ఫ్లెక్సీలు వెలిసాయి.ఈ సందర్భంగా తొట గణేష్, పేట చంద్ర, పేట చిరంజీవి సారధ్యంలో పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినూత మాట్లాడుతూ రాబోవు రోజులు కీలకమైనవన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం చోటుచేసుకుందన్నారు. చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్ జనంలో దూసుకుపోతున్నారన్నారు.దాంతో అధికార పార్టీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయన్నారు. ప్రతి చిరంజీవి అభిమాని జనసేన నాయకునికి ఓ సైనికునిలా పని చేసి తమ సత్తా ఏమిటో చూపాలని వినూత పిలుపు నిచ్చారు.బస్టాండు సర్కిల్‌లో వందలాది మందికి అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో మెగా ఫ్యాన్స్ వేణుగోపాల్,రవి,చైత్,కిషోర్, గురవయ్య,ఫాహద్, జనసైనికులు మునిశేఖర్‌రెడ్డి, తులసి, గోపి, టాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22 ప్రభాతవార్త : నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవాని గుంటలోని క్రికెట్ స్టేడియంలో చిన్న చిన్న పనులు త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. మంగళవారం ఆటో నగర్ సమీపంలోని గొల్లవానిగుంటలో స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణం, కట్ట అభివృద్ధి పనులు ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు తొమ్మిది కోట్ల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో గొల్లవానిగుంట వద్ద క్రికెట్ స్టేడియం, గుంట కట్ట అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో వాకింగ్ ట్రాక్ ఏర్పడుతుందన్నారు. ఈ స్టేడియం వద్ద పెవిలియన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. పెవిలియన్‌తో పాటు చిన్న చిన్న పనులు కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలోనే ఈ స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కమిషనర్‌తో పాటు మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ గోమతి, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## 25న శాంతారాం పవార్ కాంస్యవిగ్రహావిష్కరణ



శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రాజకీయ చిత్రపటంలో, చరిత్రలో మచ్చలేని నాయకుడుగా నిలిచిన శాంతారాం జె పవార్ కాంస్యవిగ్రహాన్ని ఈ నెల25న ఆవిష్కరించనున్నట్లు పివిఆర్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రావువి.పవార్, దస్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె పవార్‌లు తెలిపారు. శ్రీకాళహస్తిలో నిరుపేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే మహోన్నత లక్ష్యంతో ద స్కూల్ అనే పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత శాంతారాం జె పవార్ ది. విగ్రహాన్ని దస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు హాజరు కానున్నారు. శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో పవార్ కుటుంబానికి ఎనలేని గుర్తింపుఉంది.శ్రీకాళహస్తి పంచాయతీగా ఉన్నపుడు రామ చంద్రారావు పవార్ పరిపాలించగా, మేజర్ పంచాయతీ తృతీయశ్రేణి మున్సిపాలిటిగా జయరామా రావు పవార్ పరిపాలించారు. ఆయన తరువాత ఛైర్మెన్‌గా మాధవరావు.పిఆర్. పరిపాలించారు. 1982లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మొదటి సారి పవార్ కుటుంబవారసుడుగా శాంతారాం.జె. పవార్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మెన్‌గా కూర్చొబెట్టారు. ఈ నెల 25న ఆయన కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

## కొత్తపాళెం మిట్టలో డప్పుకొట్టి బాబు పథకాల ప్రచారం



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 22 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జారి చేసిన మినీ మెనిఫేస్టోను శ్రీకాళహస్తి తెలుగుదేశం ద్వితీయశ్రేణి నాయకులు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.ఈ నేపద్యంలో కొత్తపాళెం మిట్టలో మంగళవారం డప్పు వాయిస్తూ ప్రచారం చేపట్టారు.ఇటీవల తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడు పార్టీ మిని మెనిఫేస్టోను విడుదల చేసారు. ఇందులో ఆరు సూత్రాలను రూపొందించారు. జనాలకు ఆయన వరాల జల్లు కురిపించారు.ఈ వరాలు జనంలోకి తీసుకెళ్ళటానికి ఆదేశించారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీలోని కొత్తపాళెం మిట్ట గ్రామంలో ప్రచారం చేపట్టారు. ముఖ్యంగా మహిళలకు ప్రకటించిన మహాశక్తి వరాలను పట్టణ పార్టీ కార్యదర్శి కాసరం రమేష్ డప్పు బట్టి వాయిస్తూ దండోరాలా ప్రజలకు వివరించటం ఆకట్టుకుంది. 18సంవత్సరాలు నిండి 59 సంవత్సరాల లోపు ప్రతి మహిళలకు రూ.1500లు నెలకు ఉచితంగా అందించే పథకం. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే ప్రతి బిడ్డకు రూ.15వేలు పిల్లల చదువులకు అందించటం,జిల్లాలో ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత పయనం,ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అంటూ జనానికి ఇంటింటికి వెళ్ళి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లోమండల పార్టీ అధ్యక్షులు కామేష్‌యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, మాజీ కౌన్సిలర్‌మాజీ పార్టీ అధ్యక్షురాల రేణుకాదేవి,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, మహిళా అధ్యక్షురాలు సుమతి, మండల అధ్యక్షురాలు సుభాషిణి,వజ్రం కిషోర్, జగదీశ్వరరెడ్డి, దామోదరంరెడ్డి,మాజీ మండలాధ్యక్షురాలు విజయలక్ష్మీ, శ్రీలక్ష్మీ, మునిరాజాయాదవ్, సునీల్, ధారాపాండు, వివేక్, సుబ్బమ్మ, సిద్దమ్మ, వెంకటమ్మ, సుబ్బమ్మ భారతి, నాగమ్మ బూత్‌కన్వీనర్ తేజ,విజయకుమార్‌లు పాల్గొన్నారు.

## సేవలబోర్డు ఇలా మూలపడింది..



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న సేవల ఫ్లెక్సీ బోర్డును ఇటీవల కుమారస్వామి తిప్పవద్ద ఏర్పాటుచేశారు. అయితే బోర్డు మూలపడి పోవడంతో ఎవ్వరు పట్టించుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సేవల వివరాలు తెలియడంకోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డును తిరిగి ఏర్పాటుచేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

## అభివృద్ధే మా అభిమతం

**- సకాలంలో అభివృద్ది పనులు పూర్తి కావాలి- తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, ఆగస్టు22 ప్రభాతవార్త: అభివృద్దే అభిమతంగా...ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం తిరుపతిరూరల్ మండలం పరిధిలో చేపడుతున్న అభివృద్ది పనులపై తిరుమల నగర్, మంగళం, రణధీర్‌పురం, సప్తగిరి కాలనీ, తిరుచానూరు, యోగిమల్లవరం, దామినేడు, ముండ్లపూడి, పాడిపేట, బ్రాహ్మణపట్టు, పద్మావతిపురం, శ్రీనివాస పురం, సాయినగర్ గ్రామ పంచాయతీలలో అధికారులు, సిబ్బందితో తుడ ఛైర్మెన్ చర్చించారు. ఈ కార్యక్రమంలో తుడ ఛైర్మెన్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి నిధులు కేటాయిం చామని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి సంక్షేమంలో ఎక్కడా రాజీ పడలేదని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపించాలని మోహిత్‌రెడ్డి కోరారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మంగళం-2 ఎంపిటిసి లక్ష్మీ భర్త, వార్డు సభ్యులు గణేష్‌ను పరామర్శించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గదుల కొరతను అధిగమించండి

**-క్యూలైన్‌లో వేచివున్న భక్తులందరికీ అన్నప్రసాదాలు అందించండి**

**-భజనబృందాలకు ఉచితంగా సామాగ్రి అందించాలి**

**-టిటిడి ఛైర్మన్ భూమనతో విశాఖశారదాపీఠాధిపతి స్వరూపానంద**



తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు వసతి కొరతను తీర్చాలని, ఇందుకు అవసరమైన గదులు అందుబాటులో ఉంచి సమస్య అధిగమించాలని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందస్వామి సూచించారు. తిరుమలలో వైకుంఠం క్యూలైన్‌లలో వేచివున్న భక్తులందరికీ అన్నప్రసాదాలు అందేలా చూడాలన్నారు. గిరిజన,దళిత ప్రాంతాల్లో భజనబృందాలకు అవసరమైన సామాగ్రిని అందించాలని సూచించారు. భజన,కోలాట బృందాలకు ఉచిత శిక్షణనివ్వాలన్నారు. ధర్మప్రచార పరిషత్ ద్వారా విస్తృతంగా ధర్మప్రచార కార్యక్రమాలను రూపొందించాలన్నారు. యువతలో ధార్మిక భావాలు పెంపొందించేలా ధార్మిక కార్యక్రమాలను రూపొందించాలని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందస్వామి సూచించారు. మంగళవారం ఉదయం రుషికేశ్‌లోని స్వరూపానందస్వామిని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు గౌరవపూర్వకంగా కలిశారు. స్వామికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు.

# టిటిడి అధికారులతో సమన్వయపరచుకుంటూ బందోబస్తు

**శ్రీ వారి భక్తుల భద్రతే ధ్యేయంగా తిరుపతి పోలీస్ శాఖ సిద్ధం : తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి**



తిరుపతి క్రైం, ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీ వారి బ్రహ్మోత్సవాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యుత్తమ భద్రతతో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి ఈ సంవత్సరం రెండు పర్యాయాలు జరగబోయే శ్రీ వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బందోబస్తు భద్రతా పరమైన చర్యల గురించి తిరుపతి జిల్లా లోని పోలీస్ అధికారులతో తన కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పి మాట్లా డుతూ తిరుమలలో భద్రతా, నిఘా వ్యవస్థ పటిష్ట పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవా లని అధునాతమైన టెక్నాలజీతో కూడిన భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు గల అన్ని అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోని తిరుమలలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గత బ్రహ్మోత్సవాలలో ఎదురైన లోటు పాట్లను సరిదిద్దుకుంటూ ఈ సంవత్సరం జరగబోయే రెండు శ్రీ హరి బ్రహ్మోత్సవాలలో ఎదురైన లోటుపాట్లను సరిదిద్దుకుంటూ ఈ సంవత్సరం జరగబోయే రెండు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రతి బందోబస్తు పాయింట్ వద్ద ఎస్సై ఆపై స్థాయి అధికారిని ఇన్చార్జిగా నియ మిస్తూ, సంబంధిత పోలీస్ సిబ్బందిని చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించేలా వారికి బ్రీఫింగ్ చేయాల న్నారు. ప్రస్తుతం తిరుమలలో అవసరమైన అన్ని ప్రాంతాలలోని సిసి కెమరాలు ఏర్పాటు చేసి సిసిటి విలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని తెలిపారు. ఇందులో ఎక్కడైనా క్రైమ్ నేరాలు జరిగిన వెంటనే గుర్తించే విధంగా చర్యలు తీసుకోని నేరాలు అరికట్టడానికి కృషి చేయాలన్నారు. వచ్చే సెప్టెంబర్ నెలలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఉన్నందున ఈ నెలలోనే భద్రత పరమైన అన్ని అంశాల పై పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాలుగు మాడ వీధుల్లో గ్యాలరీల ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధంచి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు శాంతి భద్రత కులశేఖర్, నేర విభాగం వేముల కుమారి, తిరుమల శ్రీ మునిరామయ్య, సాయుధ దళం శ్రీ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్బి డిఎస్పి గిరిధర్, తిరుపతి తిరుమల పరిధిలోని డిఎస్పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఈ క్రాప్.. ఇక్కట్ల యూప్..

కోట,ఆగస్టు 22 ప్రభాతవార్త : రైతు భరోసా లబ్ది నుంచి పంట నష్ట పరిహారం ,పంటల భీమా ,పండించిన పంటను అమ్ముకునే వరకు రైతులకు ఇతర ఏ పథకమైనా అందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనసరి.ప్రతి సీజన్‌లోనూ రైతు భరోసా కేంద్రం స్థాయిలో సిబ్బంది ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌కు సబంధించి ఇటివల ఈ క్రాప్ నమోదు ప్రారంభించారు. క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్ నమోదులో జియో కోఆర్డినేట్స్ సాఫ్ట్‌వేర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆర్‌బీకే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రాప్ నమోదులో రోజు వారీ లక్ష్యం చేరని పరిస్ధితులోల ప్రక్రియ ఏమేరకు పూర్తవుతుందని ప్రశ్నార్ధకంగా మారింది.ఈ నెల 15 నుంచి ప్రారంభించారు. సెప్టెంబరు 15 లోగా పూర్తి చేయాలని రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఆదేశాలు అందాయి. ఇంత వరకు బాగానే ఉన్నా నమోదులో క్షేత్ర స్ధాయిలో ఎదురువుతున్న ఇబ్బందులు సిబ్బంది నానాపాట్లు పడుతున్నారు. ఈ తరణంలో ఈ క్రాప్ నమోదు ముందుకు సాగడం లేదు. యూప్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఏం చేయాలో తెలియక సిబ్బంది సతమతమవు తున్నారు. సమస్యను పరిష్కరించి ఈక్రాప్ నమోదు వేగవంతమయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి న అవశ్యకత ఉంది

## సిఎం సహాయనిధి నుండి రూ.6లక్షలు అందజేత



చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త: యాదమరి మండలం కీనాటంపల్లి గ్రామంకు చెందిన చిన్నారు రెండు సంవత్సరాల అర్షిత శాస్త్ర చికిత్స కోసం సిఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.6 లక్షల చెక్కును కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం ఆమె తల్లిదండ్రులకు అందించారు. యాదమరి మండలం కీనాటంపల్లి గ్రామంకు చెందిన శివకుమార్, ఝాన్సీలకు అర్షిత(2) కుమార్తె కలదు. ఈ చిన్నారికి 10 నెలల క్రితం తీవ్రమైన గొంతునొప్పి రావడంతో వేలూరు సిఎంసి ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స నిర్వహించారు. వేలూరు సిఎంసి ఆసుపత్రి వైద్యులు అర్షితకు ట్రేచల్ స్టెనోసిస్ అనే వ్యాధి వున్నట్లు గుర్తించారు. ఈ వ్యాధి నయం చేయడానికి ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరం వుండటంతో జులై 4న చిత్తూరు వచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చిన్నారి అర్షిత తల్లిదండ్రులు కలిసి విన్నవించారు. ఈ మేరకు పాపకు అవసరమైన వైద్య సహాయం అందిస్తామని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి వెళ్ళారు. ఇచ్చిన మాట మేరకు సిఎం సహాయ నిధి నుండి రూ.6 లక్షలు కలెక్టర్ సగిలి షన్మోహన్‌కు పంపగా ఆయన చిన్నారి వైద్య ఖర్చుల కోసం వారి తల్లిదండ్రులకు మంగళవారం అందజేశారు.

## కాణిపాకంలో మోస్తరు వర్షం

కాణిపాకం, ఆగస్టు 22 ప్రభాతవార్త: కాణిపాకం పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండలు భగభగ మండినప్పటికి సాయంత్రం నాలుగు గంటల నుండి వాతావరణ ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వర్షం మొదలైంది. దీనితో కాణిపాకం పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు వర్షం కురిసింది.ఈవర్షంతో వాతావరణం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షాకాలం ప్రారంభమయినప్పటికి రుతపవనాలు ముఖం చాటేయడంతో గత నెల రోజులుగా తీవ్రవర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భానుడు తీవ్ర ప్రతాపాన్ని చూపించడంతో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీనితో భక్తులు, ప్రజలు రాత్రంబవళ్ళు ఉక్కబోతతో అల్లాడిపోయారు. ఈనేపథ్యంలో వర్షం కురిసి వాతావరణ చల్లబడడంతో భక్తులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## రాగిమానుమిట్టలో మంచినీటి కష్టాలు



కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త : మండలంలోని వానగుట్టపల్లి పంచాయతీ రాగి మానుమిట్ట గ్రామంలో మంచినీటి సమస్య పరిష్క రించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో దాదాపు రెండు వందలకు పైబడి కుటుంబాలు ఉన్నాయి. అయితే తాగేందుకు ఐదారు రోజులకు ఓ సారి నీరు వస్తుండ డంతో తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారు లను అడిగితే కరెంట్ సమస్య ఉందని చెబుతు న్నారన్నారు. అధికార యంత్రాంగం స్పందించి తమ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

## కైలాసకోనలో ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం



నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త : మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ గోవిందప్ప నాయుడు కండ్రిగ పరిధి కైలాసకోనలో మంగళవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వ రస్వామి దేవస్థానం తరపున వచ్చిన ప్రచారంలోని శివపార్వ తులకు ఘనంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తీ శ్వర దేవస్థానం నుంచి వచ్చిన ప్రచార రథానికి ఆలయ మర్యాదలతో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కళ్యాణోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌బాబు, ఆలయ ఇఒ ఎం కృష్ణానాయక్, పాలకమండలి సభ్యులు, అర్చకులు బాబుస్వామిలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో 25న ఉద్యోగస్తుల గ్రీవెన్స్ డే : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 22 ప్రభాతవార్త : జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఉద్యోగస్తుల గ్రీవెన్స్ ఏర్పాటుకు వివిధ శాఖలలో పని చేస్తున్న రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులు, వారి కుటుంబ సభ్యులు సంతోషంగా జీవించడానికి వారి సమస్యలు పరిష్కరించుటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ వెంకటరమణా రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలలో పని చేస్తున్న రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంబంధించిన వ్యక్తిగత గ్రీవెన్స్‌లను పరిష్కరించే దిశలో జిల్లాలో ఇకపై ప్రతినెల మూడవ శుక్రవారం ఉద్యోగస్తుల గ్రీవెన్స్ దేను జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించడం జరుగుతుందని సదరు విషయాన్ని సంబంధిత శాఖాధిపతులు వారి సిబ్బందికి తెలియజేయాలని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న, రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులు వారికి సంబంధించిన వ్యక్తిగత గ్రీవెన్స్‌లో పరిష్కారం కొరకు ఫిర్యాదు చేయవచ్చని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## ప్రజాజీవితంలో...మమేకమైన శ్రమజీవుల కళే జానపదం

**-కళాకారుడు సాంబోలు హరినాథ్‌కు సన్మానం**



తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త: బిడ్డకు పాలిస్తూ తల్లి పాడిన జోలపాటే లాలిపదమై అది జన పదంగా మారి, శ్రమజీవుల కళేజానపదమైందని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. జానపదదినోత్సవ వేడుకలు మంగళవారం సంస్థ కార్యాలయంలో జరుపుకున్నారు. శ్రామికుడు,కర్షకుడు తన కష్టాన్ని మరచిపోవడానికి వారు చేస్తున్న పని హుషారుగా సాగటానికి ఆటపాట జానపదులతో ఉద్భవిం చిందని గోపీనాథరెడ్డి చెప్పారు. జానపదకళా కారుడు సాంబోలు హరినాథ్‌ను ఈ సందర్భంగా దుశ్శాలువతో సత్కరించారు. ఆయన జానపద కళకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కెఎస్ రాజ, రాజశేఖరరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, విజయ కుమార్, జయంత్ పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి పల్లకిసేవ



పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీ ధర్మరాజుల స్వామివార్షిక బ్రహ్మోత్సవాలు (తిరుణాళ్లు) సందర్భంగా శ్రీద్రౌపదీదేవి అమ్మ వారికి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఉభయదాతగా విశ్వబ్రాహ్మణ లేపాకం చిరంజీవి ఆచారి, సుబ్రహ్మణ్యం ఆచారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అలాగే ద్రవిడ విశ్వ విద్యాలయం వార్ల ఆశీస్సులతో శ్రీ ద్రౌపదీ వైభవం కార్యక్రమం ఏ.నాగభూషణం, రేణుక, కరుణికర సంఘం ప్రముఖ న్యాయవాది కేజీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గీతామందిరం వారిచే అన్నమయ్య సంకీర్తనలు కార్యక్రమం, రాత్రి అశ్వ వాహనంపై స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతగా బెస్త సంఘం, బెస్తవీధి, గోవిందపాళెం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఏకాంత సేవ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కేసీ మధు సన్నాఫ్ లేట్ కేసీ గుర్రప్పనాయుడు మధు ఫ్యాన్సీ స్టోర్(పుత్తూరు) వ్యవహరించారు. శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకృష్ణార్జున నాట్య కళా మండలి ఆధ్వర్యంలో మహాభారత నాటకం ఈ నెల 22వ తేదీ నుంచి 26 వరకు మహాభారత నాటకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బి.ఎస్.మోహన్, కోవిల్‌కార్ మాజీ ఛైర్మన్ సాల్వాకం కిష్టప్ప మొదలియార్, ప్రేరణ కూర్పు శివాలయం ఆలయ మాజీ ఛైర్మన్ సాల్వాకం ఏళుమలై మొదలియార్, పాలక మండలి సభ్యులు డి.ముకుంద ప్రకాష్, సెల్వరాజపిళ్లై, మునిరాజా లక్ష్మి, సుధనిర్మల, మహాదేవి ఆలయపూజారి మోహన్‌లు పాల్గొన్నారు.

**నేడు ఆలయంలో కార్యక్రమాలు...**

శ్రీ ద్రౌపదీ దేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం ఉదయం ఆలయంలో 9 గంటలకు ఉత్సవం. గాండీవ సందోహం రాజ సూయ యాగం, రాత్రి గజ వాహనంపై ఊరేగింపు అనంతరం కాండవ దహనం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## పుత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : మంత్రి రోజా



పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తున్న ట్లు మంత్రి రోజా పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీలోని కార్వేటినగరం రోడ్డులో 14వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ రూ.36.5 లక్షలతో నిర్మించిన మురుగునీటి కాలువను ప్రారంభించారు. రూ.13.10 లక్షలతోనిర్మించనున్న మురుగునీటి కాలువకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత అని తెలిపారు. అనంతరం శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా బజారు వీధిలోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు సారె కార్యక్రమం బజారువీధి నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా కాపువీధి ,దేవాలయానికి చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రి రోజాను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలో విశేష పూజలు చేసి పట్టు వస్త్రాలు సారె సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహరావు, పుత్తూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, కమిషనర్ ఎల్.ఎస్.రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి మ్యూజిక్స్ రెండోపాట విడుదల



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన స్వర్ణముఖి మ్యూజిక్స్ చిత్రీకరించిన రెండవ పాటను మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఈపాటలో ఉంగరాల మునెయ్య ముఖ్యపాత్రదారుడిగా, రచన, దర్శకత్వం గంగపుత్ర గాంధీ చిత్రీకరించారు. ఈసందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రు లు చిన్న తనంలో తమ పిల్లలను పెంచి పోషించి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తర్వాత వారి పిల్లలకు పెళ్ళయిన తర్వాత వృద్దాప్యంలో వారి తల్లిదండ్రులను పోషించకుండా వృద్ధాశ్రమాల్లో వదిలివెళ్ళే వారు కొందరు , అలా కాకుండా ప్రతి ఒక్కరు వారి తల్లిదండ్రులను చివరిదశలో ఆప్యాయతగా చూసుకోవాలన్న సందేశాన్ని తెలిపే పాటను శ్రీకాళహస్తికి చెందిన కళాకారులు కలసి అద్భుతంగా చిత్రీకరించారని వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత గరికపాటి రమేష్‌బాబుతోపాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# భక్తులను కటాక్షించిన శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి

**సారె సమర్పించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు**



రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త: భక్తుల పాలిట కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే మనసున్న మాయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి మంగళవారం రేణిగుంట జాతరలో భాగంగా భక్తులను ప్రసన్న వదనంతో కటాక్షించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త కమిటీ ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి కమిటీ సభ్యులతో కలసి ఎమ్మెల్యేకు స్వాగతం పలికి దర్శనానంతరం అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భక్తులు గుడి ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పొంగించి గంగమ్మశూలం వద్ద అంబళ్లు సమర్పించి తమ భక్తినిచాటుకున్నారు. రేణిగుంట పట్టణం అమ్మవారి నామస్మరణతో మారు మోగింది. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ వేరు వేరుగా దేవాలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీధుల్లో వెలసిన దుకాణాలు, రంగుల రాట్నాలు, కొలంబస్, తదితర వినోద వస్తువులు జాతరకు ప్రత్యేక ఆకర్షణ చేకూర్చాయి. రాత్రి జరిగిన సాంస్కృతి కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. సీఐ సుబ్బారెడ్డి తమ సిబ్బందితో గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. జాతరలో భక్తులకు ఆటంకం జరగకుండా ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, వి.ఆర్.రావణన్, సదాశివరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.